తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
సోమవారం
08 జూన్ 2026
పేజీలు : 8



## మృగశిర కార్తె వచ్చిన.. మార్కెట్లో చేపజోరు!




- ○నేటి నుండి మృగశిర కార్తె ప్రారంభం
- ○రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం
- ○మృగశిర కార్తె రోజు చేపల వంటకాలు స్పెషల్

**కొండమల్లేపల్లి, జూన్ 7 (జనంసాక్షి):** తొలకరి వర్షాలకు సూచిక అయిన మృగశిర కార్తె రైతన్నలకు అత్యంత పర్వదినం. జూన్ 8 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్తెతో వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. నైరుతి రుతుపవనాలు ప్రవే శించి, కురిసే చిరుజల్లులతో భూమి చల్లబడు తుంది. రైతులు దుక్కి దున్ని, విత్తనాలు నాటే పనుల్లో నిమగ్నమవుతారు. మృగశిర కార్తె రోజున రైతులు ఎడ్లను, వ్యవసాయ పనిముట్లను పూజించి పొలంలోకి అడుగుపెడతారు. అలాగే ఈ రోజున ఆరోగ్య రక్షణ కోసం బెల్లంలో ఇంగువ కలిపి తినే సంప్రదాయం కూడా ఉంది. వేసవి కాలం ముగిసి వర్షాకాలం రాకకు స్వాగతం పలికే మృగశిర కార్తె నక్షత్రం ఈనెల 8 నుంచి ప్రారంభం కానుంది. మిగతా 2లో

## యువ కవి ధారా శ్రీకాంత్‌కు ఘన సన్మానం



**ఖమ్మం కార్పొరేషన్,జూన్ 8 (జనంసాక్షి)**
శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహితి సేవా సంస్థ ,చైతన్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ , రాజమహేంద్రవరం లో తెలుగు భాష, సంస్కృతి, వైభవం, సాహిత్యం, కళలు, తెలుగు సాంప్రదాయాలు వైభవం లో భాగంగా జూన్ 6,7 -2026 జరుగుతున్న 7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జెక్కేపల్లి పల్లి గ్రామానికి చెందిన యువ కవి దారా శ్రీకాంత్ గారు కార్యక్రమంలో పాల్గొని కవితా గానం చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమునకు దేశ, విదేశాల నుండి కవులు,కళాకారులు ,రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొని సభలను విజయవంతం చెయ్యటం జరిగింది. కార్యక్రమంలో యువ కవి దారా శ్రీకాంత్ ని ఘనంగా సన్మానించటం జరిగింది.

## రైతాంగానికి మృగశిర కార్తె ముందస్తు శుభాకాంక్షలు

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి



**గుర్రంపోడు, జూన్ 7 (జనంసాక్షి)**
మృగశిర కార్తె ప్రారంభాన్ని పురస్కరించుకుని గుర్రంపోడు మండల ప్రజలకు, ముఖ్యంగా రాత్రింబవళ్లు కష్టపడే అన్నదాతలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో మృగశిర కార్తెకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ రోజు నుంచే రైతులు తమ సాగు పనులను అధికారికంగా ప్రారంభిస్తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పాశం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మృగశిర కార్తె రాకతో దేశంలోకి రుతుపవనాలు సంపూర్ణంగా ప్రవేశించి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని వరుణ దేవుణ్ణి ప్రార్థించారు. నియోజకవర్గంలోని రైతాంగమంతా ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి రైతు ముఖంలో సంతోషం చూడాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని పాశం గోపాల్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## నల్గొండలో ఒక కుటుంబం అదృశ్యం

### పోలీసుల గాలింపు





**నల్లగొండ ప్రతినిధి,జూన్ 7,(జనంసాక్షి):** నల్గొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్ లోని శ్రీనివాస కాలనీకి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులు శనివారం (06.06.2026) నుంచి కనిపించకుండా పోవడంతో ఆందోళన నెలకొంది. అదృశ్యమైన వారిలో గిరి శ్రీకాంత్ (44), భార్య గిరి లక్ష్మి (42), కుమార్తె హర్షిత (23), కుమారుడు సాయి చరణ్ (20) ఉన్నారు. వీరు ఆరు సంవత్సరాల క్రితం కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతం నుంచి నల్గొండకు వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు. శ్రీకాంత్, లక్ష్మి దంపతులు పట్టణంలోని కిరాణా దుకాణాల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, జూన్ 6వ తేదీ నుంచి కుటుంబ సభ్యులందరూ కనిపించకపోవడంతో వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వీరి గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే నల్గొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 8712667670 లేదా ఎస్ఐ జె. సైదులు సెల్ నంబర్ 8712577228 ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## కుక్కల నుండి ప్రజలకు విముక్తి ఎప్పుడో..



**వలిగొండ, జూన్ 7 (జనంసాక్షి):** మండలంలోని వలిగొండ నుండి దాసిరెడ్డి గూడెం వెళ్లే రహదారికి ఇరువైపులా వ్యర్థాలు వేయడం వల్ల కుక్కలకు అడ్డగా మారి. రహదారి పై వెళ్లే బాటసారిలను, వాహనాల పైన వెళ్లే వాహన దారుల పైన దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పోయిన అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

# మృగశిర కార్తె వచ్చేసె.. మార్కెట్లలో చేపల జోరు!

వేసవి ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు మృగశిర కార్తె నుంచి కురిసే వర్షాలకు వాతావరణం చల్లబడి ఉపశమనం పొందు తారని వేద పండితులు పేర్కొంటున్నారు. ప్రజలు ఈ రోజు ప్రత్యేక వంటకాలు చేసుకుంటారు. చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజల నమ్మకం. వేసవి ముగిశాక చలిని తట్టుకునేందుకు మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. ఉబ్బసం, ఆయాసం ఉన్నవారికి చేప మందు పంపిణీ చేపడతారు. రైతులు గ్రామాల్లో వ్యవసాయ పనులను ప్రారంబి .స్తారు. మృగశిర కార్తె అనగానే ఠక్కున గుర్తుకు వచ్చేది చేపలు. చాలా మంది ఈ జనరేషన్ వాళ్లకు మృగశిర కార్తె అంటే చేపలు తినాలంటారు. ఎందుకంటే వేసవి ముగియనుండడంతో తెలుగు రాష్ట్రల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. వాతా వరణం మార్పుల కారణంగా శ్వాస సంబం ధిత వ్యాధులు తలెత్తుతాయి. అందుకు మృగశిర కార్తె మొదటి రోజు చేపలు తినడం వల్ల ఎలాంటి జబ్బులు రావని మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం. ఈ రోజు చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు మంచిదని అంటున్నారు. కాగా ఈ రోజు మృగశిర కార్తె సందర్భంగా కొండమల్లేపల్లి మండల వ్యాప్తంగా పలు చేపల దుకాణాలు కిటకిట లాడుతున్నాయి. మృగశిర రోజు కావడంతో చేపల కోసం ప్రజలు పోటెత్తారు. మృగశిర కార్తె రోజు చేపలు విక్రయాలు భారీగా ఉంటాయన్న నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి కొండమల్లేపల్లి పట్టణానికి చేపలు వచ్చాయి. మృగశిర కార్తె సందర్భంగా కేజీ రొయ్యలు 500, కొర్రమీను రూ.500 నుంచి రూ.700లకు అమ్ముతున్నారు. ఇతర చేపలు కూడా 100, 200, 300 రూపాయ లకు కేజీ చొప్పున విక్రయిస్తున్నారు. సాగర్ రోడ్ నైస్ రెస్టారెంట్ ఎదురుగా, దామోదర్ ఫ్యామిలీ దాబా పక్కన మంచి శుభ్రమైన రుచికరమైన చేపలు ప్రజలకు అందుబాటు ధరలోనే ఉన్నాయని రైతులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేపల నిర్వాహకులు నేనావత్ రఘు శారదా తెలిపారు.



## ఖమ్మంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ - 07 ( జనంసాక్షి )**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్.ఐ.ఆర్) మ్యాపింగ్ లో అనామలీస్ ల సవరణకు బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన తప్పనిసరి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు.ఆదివారం ఖమ్మం నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. రఘునాథ పాలెం మండలంలోని కోటపాడు గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆనతరం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి కలెక్టర్ ఖమ్మం నగరంలో రెండవ డివిజన్ పాండురంగాపురంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ×జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 2002 ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో నమోదైన ఓటర్లు, వారి వారసులు, కుటుంబ సభ్యులను ప్రస్తుత ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో గుర్తించిన అనామలీస్ లను వెంటనే సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు.జూన్ 10లోగా ఓటరు జాబితా అనామలీస్ లను పూర్తిగా పరిష్కరించాలని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవగహన కల్పిస్తూ సరైన వారి తండ్రి, తల్లి, నాన్నమ్మ, తాతయ్య ఓటర్ల కార్డులతో మ్యాపింగ్ చేయాలని సూచించారు.

అనామలీస్ ల సవరణకు బీఎల్ఓలు ఇంటింటి పరిశీలన తప్పనిసరి చేయాలని, సూపర్వైజర్, అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 25 నుంచి జులై 24 వరకు నిర్వహిస్తామని, డబుల్ ఓట్లు, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



**వైరా జూన్ 7 జనంసాక్షి**

గొల్లపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ - ఎస్ ఆర్ డి ఎస్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ సర్వేవర్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ గడ్డం రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలోనే మానవాళిని క్యాన్సర్ అనే మహమ్మారి పట్టిపీడిస్తోంది అన్నారు ప్రతి ఒక్కరు వారి యొక్క రోజువారి పనులు లో భాగంగా క్యాన్సర్ నివారణ పైన చర్యలు తీసుకోవాలని కోరారు ఈరోజు జాతీయ క్యాన్సర్ సర్వేర్స్ డే పురస్కారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు రాబోయే రోజుల్లో మనం ఆహారం పట్ల జాగ్రత్త తీసుకోకపోతే ప్రతి కుటుంబంలో కూడా క్యాన్సర్ కేసులు పెరిగే అవకాశం ఉంది కావున ప్రతి ఒక్కరు కూడా వారు ఏమి తింటున్నారు అనేదానిపైన అవగాహన కలిగి ఉండాలి తద్వారా శరీరము అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు క్యాన్సర్ ను జయించిన వాళ్లను ఆదరించాలని కోరారు వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో క్యాన్సర్ తో పోరాడి జయించిన వారి యొక్క అనుభవాలను స్వయంగా వారి ద్వారానే తెలియజేయడం జరిగింది వారిని ప్రోత్సహించి కావాల్సిన ధైర్యాన్ని నించటం కూడా జరిగింది.ఈ కార్యక్రమంలో సీబీఐ ఆర్ సి టి సీనియర్ ఫ్యాకల్టీ షేక్ వహీద్ పషా గారు పాల్గొని మాట్లాడుతూ ప్రతిరోజు మనం వాడే వస్తువులు తినే ఆహారం ద్వారానే క్యాన్సర్ విజృంభిస్తుంది కావున ప్రతి ఒక్కరం కనీస స్పృహ కలిగి ఉండాలి తద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో యస్ ఆర్ డి ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రతాప్ మరియు గ్రామంలోని ప్రజలు పాల్గొనడం జరిగింది.

## అనాధ మహిళకు అంత్యక్రియలు

**ఖమ్మం, (జనంసాక్షి) :**



ఖమ్మం నగరంలోని మదర్ తెరిసా అనాధ ఆశ్రమంలో నివసిస్తున్న రిబ్కా అనే అనాధ మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని ఆశ్రమ నిర్వాహకులు అన్నం ఫౌండేషన్‌కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. సమాచారం అందుకున్న వెంటనే అన్నం ఫౌండేషన్ సభ్యులు ఆశ్రమానికి చేరుకుని, అక్కడి సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫౌండేషన్ కార్యాలయానికి తరలించి తెల్లని వస్త్రంతో చుట్టి, పూలు, పూలదండలతో నివాళు లర్పించారు.తదుపరి మృతదేహాన్ని బల్లేపల్లిలోని వైకుంఠధామానికి తరలించి గౌరవప్రదంగా దహన సంస్కారాలు నిర్వహించారు. అనాధగా జీవించిన మహిళకు చివరి ప్రయాణంలో మానవత్వాన్ని చాటుతూ అంత్యక్రియలు నిర్వహించడం పట్ల స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



## బూతు లెవెల్ అధికారుల శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

**కల్లూరుజూన్ 07(జనం సాక్షి)**

కల్లూరు డివిజన్ పరిధిలోని కల్లూరు,పెనుబల్లి , సత్తుపల్లి, వేంసూరు మండలాలలో నిర్వహించిన బూత్ లెవల్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని కల్లూరు సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ సందర్శించి సమీక్షించారు. ఈ సందర్భంగా బి ఎల్ వోలకు సర్ 2026 ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న జీరో అనామలీస్ జాబితాను అత్యవసరంగా పరిశీలించి, ఎటువంటి ఆలస్యం లేకుండా పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సూచించారు.అదేవిధంగా, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి 100 శాతం ఖచ్చితత్వంతో, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోపు అన్ని అనామలీలను క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల జాబితాల స్వచ్ఛత, పారదర్శకత నాణ్యతను కాపాడేందుకు బి ఎల్ వో లు సమన్వయంతో పనిచేయాలనిఆయనసూచించారు.




## కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం, మజ్జిగ వితరణ కార్యక్రమం

**పెనుబల్లి, జూన్ 7(జనం సాక్షి )**

వేసవిలో ప్రయాణికుల సౌకర్యార్థం వీఎం బంజర్ బస్టాండ్ ఆవరణలో పెనుబల్లి మండల కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ వితరణ కేంద్రం ముగింపు సందర్భంగా ఆదివారం సేవాసమితి ఆధ్వర్యంలో అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ భూక్య ప్రసాద్,ఉప సర్పంచ్ తాళ్లూరు రవి, సేవా సమితి నాయకులు గోగినేని రమేష్, తోపాటు పొన్నగంటి ఇందిరా, నల్లమోతు సునీల, కోగంటి సుజాత, తాంళ్ళూరి కృష్ణకుమారి పొన్నగంటి రేణుక, కారుమంచి కవిత, వల్లపునేని మాధవి, ఏటికూరి పద్మావతి, గోగినేని పద్మావతి, ముత్తుం లక్ష్మీ, చలసాని ఝాన్సీ, కొమ్మినేని కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షులుగా నరసింహా ఎన్నిక

### టి యు డబ్ల్యూ జే జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి ప్రకటన

**కనగల్, జూన్7(జనంసాక్షి):**

టి యు డబ్ల్యూ జే (ఐజేయు) జిల్లా కమిటీకి అనుబంధంగా ఉన్న జిల్లా ప్రెస్ క్లబ్ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. అందులో భాగంగా కనగల్ మండలానికి స్థానం కల్పించగా జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ మల్లెపల్లి నరసింహా ను నియమిస్తున్నట్లు టీ యు డబ్ల్యూ జె(ఐజేయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ లో తన ఎన్నికకు సహకరించిన టియుడబ్ల్యూజే జిల్లా కమిటీకి, మండల కమిటీకి, సహచర పాత్రికేయ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



# విజయవంతమైన ఉచిత మెగా క్యాన్సర్ క్యాంప్

## పొగాకుకు దూరంగా ఉండండి:డాక్టర్ చిలుకూరి రామకృష్ణ ప్రసాద్..

**చండూరు, జూన్ 7 (జనంసాక్షి)**
స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్ సౌజన్యంతో స్థానిక చండూరు మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు సహకారంతో ఉచిత మెగా క్యాన్సర్ క్యాంప్ ను గాంధీజీ విద్యాసంస్థలలో నిర్వహించడం జరిగింది.ఈ క్యాంపు నందు చండూరు వాస్తవ్యులు డాక్టర్ చిలుకూరి రామకృష్ణ ప్రసాద్ (క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు), డాక్టర్ శిరీష (బ్రెస్ట్ సర్జరీ స్పెషలిస్ట్) సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించారు.ఈ క్యాంప్‌ను ఉద్దేశించి డాక్టర్ చిలుకూరి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. పొగాకు క్యాన్సర్‌కు కారకమని, పొగాకు వల్ల నోటి క్యాన్సర్ వస్తుందని తెలియజేయడం జరిగింది. కావున ప్రజలందరూ పొగాకును విడనాడాలని సూచించారు. క్యాన్సర్ ను మొదటి దశలో గుర్తిస్తే భయపడవలసిన అవసరం లేదని, చికిత్స ద్వారా నయం చేయ వచ్చునని అన్నారు. ఈ క్యాంపులో మహిళలు ఎక్కువ పాల్గొన్నారని, వీళ్ళందరికీ టెస్టులు చేశామని మూడు రోజుల్లో ఫలితాలు వచ్చిన తర్వాత ఎంతమంది పేషెంట్లు ఉన్నారో తెలుస్తుందని తెలిపారు. అలాగే ఈ క్యాంప్‌ను ఉద్దేశించి చండూరు మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్ వారు ఉచిత మెగా క్యాన్సర్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి, ఒక్కొక్కరికి పదివేల రూపాయల పరీక్షలను ఉచితంగా చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి క్యాంపులు నిర్వహించడానికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, అదేవిధంగా భవిష్యత్తులో వివిధ రకాల ఉచిత మెగా క్యాంపులను నిర్వహిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్స్ మేనేజర్ సుమన్, కోడి గిరిబాబు, కోడి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ్, కౌన్సిలర్లు బుషిపాక వాసు, కటకం రమేష్, తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, కొండ్రెడ్డి మధు, సిపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాపోలు ప్రభాకర్, కర్నాటి శీను, చిలుకూరి అశోక్, గజ్జల కృష్ణారెడ్డి, సరికొండ వెంకన్న, నెల్లూరి శ్రీనివాసులు, పున్న సైదులు, పున్న ధర్మేందర్, తదితరులు పాల్గొన్నారు.



### ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా

# కుంభం ఇంద్రసేనారెడ్డి

**మునుగోడు, జూన్ 7(జనంసాక్షి)**



టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ అనుబంధమైన నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా కుంభం ఇంద్రసేనారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టీయూడబ్ల్యూజే (ఐజేయు) నల్గొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి శనివారం రాత్రి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీతో పాటు నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కుంభం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ,జిల్లా నాయకత్వానికి,వివిధ హోదాలలో ఉన్న సంఘం బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ హాలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మాదరి యాదగిరి, ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. సంఘం బలోతమే లక్ష్యంగా, అందరి సహకారంతో ముందుకు సాగుతాననీ తెలిపారు.జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక అయిన కుంభం ఇంద్రసేనారెడ్డికి మండల, జిల్లా వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఉపాధి హామీ కూలీలకు రోజువారి కూలీ 800 వర్తింప చేయాలి

### నాంపల్లి మండల కేంద్రంలో

### వ్యవసాయ కార్మిక సంఘం కరపత్రం ఆవిష్కరణ

**నాంపల్లి,జూన్ 7 (జనం సాక్షి)**
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా 20వ మహాసభలు జూన్ 12న తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి కె ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటలకు జరుగుతుంది, మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి కర్నాటి సుధాకర్ అన్నారు.ఆదివారం నాంపల్లి మండల కేంద్రంలోమహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల, ఉపాధి హామీ కూలీల హక్కుల రక్షణకై పోరాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా 20వ మహాసభలు జయప్రదం చేయాలని అన్నారు . ఈ మహాసభలలో వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా ఏర్పడిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని పాత చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరుతూ పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.సంఘం ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాల కాలంలో నిర్వహించిన పోరాటాలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగిన ఆందోళనలు సమీక్షించి భవిష్యత్ మూడు సంవత్సరాల పోరాటాలకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలియజేశారు.కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ కార్మిక వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై రైతులు వ్యవసాయ కార్మికులు కలిసి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావలసిన ఆవశ్యకత మహాసభలో చర్చించడం జరుగుతుందని అన్నారు.ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులు పని ప్రదేశాలలో ప్రమాదాలు పనిముట్లు పంపిణీ కోసం పట్టణ ప్రాంతాలలో ఉపాధి వర్తింప చేయడం కోసం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు ఉపాధి కూలీలకు రోజువారి కూలీ 800 వర్తింపచెయ్యాలి రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇస్తామని ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంవత్సరానికి 12,000 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సిఐటియు మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత, జి శ్రీకాంత్ ముత్తమ్మ లక్ష్మమ్మ ముత్తమ్మ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### నల్గొండ జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి

**కొండమల్లేపల్లి, జూన్ 7 (జనంసాక్షి):**



టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీకి అనుబంధమైన నల్గొండ జిల్లా ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు. నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా కలిమల నాగయ్య మిర్యాలగూడ, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నాగార్జున సాగర్, కోశాధికారిగా యాదగిరి మిర్యాలగూడ లతోపాటు జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మద్ది శ్రీనివాస్ రెడ్డిని ఏకగ్రీవంగా నియమించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉపాధ్యక్ష పదవి అవకాశం ఇచ్చినందుకు జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ మరింత బలోపేతం చేస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో అందరికీ అందుబాటులో ఉంటూ నా వంతుగా కృషి చేస్తానన్నారు.



### జూలూరు కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

#### అధ్యక్షులుగా ఒంటెద్దు వెంకటేశం

**భూదాన్ పోచంపల్లి, జూన్ 7(జనంసాక్షి ):**
కాంగ్రెస్ పార్టీ జూలూరు గ్రామ శాఖ నూతన కమిటీని కార్యకర్తల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ?కమిటీ అధ్యక్షులుగా ఒంటెద్దు వెంకటేశం, ఉపాధ్యక్షులుగా సిరిపాంగి గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా సందెని బాలకృష్ణ, కోశాధికారిగా గంగాపురం శివ, మైనార్టీ కార్యదర్శిగా ఎండి చాంద్ పాషా బాధ్యతలు స్వీకరించారు. ?సభ్యులుగా దత్తాయిగూడెం శ్రీధర్, కమటి శరత్, కేతం నాగరాజు, మూటపురం ప్రభాకర్, చిలువేరు ఐలయ్య, సందిని అఖిల్, కొత్తపల్లి శ్రీనివాస్ మరియు గువ్వల నాగరాజు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారందరికీ పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

### కుమ్మరులు విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయంగా ఎదగాలి

**కొండమల్లేపల్లి, జూన్ 7 (జనంసాక్షి):**



దేవరకొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నల్గొండ జిల్లా కన్వీనర్ రాధారపు భిక్షపతి, దేవరకొండ నియోజక వర్గ కన్వీనర్ తోటపల్లి కిరణ్ అన్నారు. జూన్ 30న కొండమల్లేపల్లిలో సాయి కృప ఫంక్షన్ హాల్ లో నిర్వహించే సర్వసభ్య సమావేశ కరపత్రాన్ని ఆదివారం కొండమల్లేపల్లి లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మరులు ఐక్యంగా విద్య ఉద్యోగ ఆర్థిక రాజకీయంగా ఎదగాలన్నారు. దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మండలాలలో గ్రామ కమిటీలు మండల కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కుమ్మరుల హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఈ కరపత్ర ఆవిష్కరణలో నిదానంపల్లి వెంకటస్వామి, నిమ్మనగోటి వెంకన్న, చిట్టిమల్ల ఆంజనేయులు, కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు ఏరుకొండ రాము, గణపురం వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి దశరథం, తోటపల్లి వెంకటయ్య, నెల్లికంటి గోపి, తోటపల్లి శ్రీనివాస్, బత్తుల ఎల్లయ్య, బొడ్డుపల్లి మల్లయ్య, బొడ్డుపల్లి వెంకటేష్, బత్తుల ప్రసాద్, తోటపల్లి వెంకటేష్, బొడ్డుపల్లి బాలకృష్ణ, బొడ్డుపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**నల్గొండ జిల్లా కన్వీనర్ రాధారావు బిక్షపతి**
**దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ తోటపల్లి కిరణ్**

## రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

ఖమ్మం కార్పొరేషన్ జూన్-07( జనంసాక్షి)

ప్రస్తుతం వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 2026 వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లావ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల వనరుల శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు.

జులై 15 వరకు వర్షాలు పడకపోతే సాగు చేయవలసిన పంటలు, జులై 30 వరకు వర్షాలు ఆలస్యమైతే చేపట్టాల్సిన పంటల ప్రణాళిక, అలాగే ఆగస్టు 15 వరకు వర్షపాతం నమోదుకాకపోతే సాగు చేయాల్సిన పంటలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో వరి సాగు చేసే రైతులు సంప్రదాయ నాటు విధానానికి బదులుగా వెదజల్లే పద్ధతిని అనుసరించాలని సూచించారు. స్వల్పకాలిక వరి రకాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, డబ్ల్యూజీఎల్-44, జేజీఎల్-1978, ఎంటీయూ-1010, జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా వంటి రకాలను సాగు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగు విస్తీర్ణం తగ్గిన పక్షంలో వాటి స్థానంలో పెసర, మినుము, బొబ్బర, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన పెసర విత్తనాలను ఆత్మనిర్భరత మిషన్ పథకం క్రింద రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పత్తి సాగు చేసే రైతులు తొందరపడి విత్తనాలు వేయవద్దని, భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు. కనీసం 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే పత్తివిత్తనాలు వేయడం మంచిదని, జులై 15 వరకు పత్తి సాగుకు అనుకూల సమయం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## జాతీయ క్రీడల్లో రాణించాలి



కోదాడ,( జనంసాక్షి):

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న క్రీడాశిబిరాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. కోదాడ పట్టణంలో ఆదివారం పాఠశాలలో జిల్లా యువజన క్రీడా సమైక్య వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం ముగింపు వేడుకలలో ఆమె పాల్గొని మాట్లాడరూ. ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధి సంక్షేమానికి అనేక పథకాలను చేపడుతున్నది తెలిపారు. ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రీడలలో ప్రతిభ కనబరిచి కోదాడకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశం ఇవ్వడం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ చిన్నారులను కేవలం చదువులకే పరిమితం చేయకుండా వారికి ఇష్టమైన క్రీడలలో ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా 40 రోజులుగా క్రీడాకారులకు పౌష్టికాహారం అందించిన దాత సిపిఐ సీనియర్ నాయకులు బద్దం భద్రారెడ్డిని పూలమాలలు సెలువులతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లెఫ్ట్ కెనాల్ మాజీ చైర్మన్ చింతకుంట లక్ష్మీనారాయణ రెడ్డి, మండల విద్యాధికారి ఎండి సలీం షరీఫ్ , కౌన్సిలర్ సైదుబాబు కౌన్సిలర్ పాశం శ్రీను, బడుగుల సైదులు, జూలూరు వీరభద్రం, తమ్మిశెట్టి చిన్న కళ్యాణ బాబు, శ్యామ్ సాయిరాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

### దేవరకొండ ఆర్డీఓగా పి. పద్మప్రియ



దేవరకొండ రాజస్వ మండలాధికారి కార్యాలయములో ప్రతి సోమవారము ఉదయము 10.00 గంటల నుండి మధ్యాహ్నం వరకు డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమమును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఆర్డీఓ పి పద్మ ప్రియ తెలిపారు. ఈ కార్యక్రమములో డివిజన్ స్థాయి అధికారులు హాజరవుతారని,ప్రజలు తమ సమస్యలను దేవరకొండ డివిజన్ స్థాయి ప్రజావాణి యందు అర్జీ చేసుకొనుటకూ మంచి వెసులు బాటు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

జనంసాక్షి , దేవరకొండ

## హజ్-2027 యాత్రికులకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు

### నల్గొండ హజ్ కమిటీ జనరల్ సెక్రెటరీ ఎండి అఫ్జల్ఉద్దీన్

నల్లగొండ,జూన్ 7 ,(జనంసాక్షి):

2027 వ సంవత్సరంలో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసిందని నల్గొండ జిల్లా హజ్ కమిటీ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అఫ్జలుద్దీన్ అన్నారు.ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.త్వరలో హజ్-2027 అధికారిక ప్రకటన విడుదల కానుంది అన్నారు.హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు పాస్‌పోర్ట్‌లను ముందుగానే సిద్ధం చేసుకోవాలి అన్నారు.పాస్‌పోర్ట్ తప్పనిసరిగా యంత్రం ద్వారా చదవగలిగే విధంగా ఉండాలి అన్నారు. పాస్‌పోర్ట్ చెల్లుబాటు కంపల్సరిగా 31 డిసెంబర్ 2027 వరకు ఉండాలి అని పేర్కొన్నారు.కొత్త పాస్‌పోర్ట్ దరఖాస్తుల్లో ఇంటి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి ఖాళీలు లేకుండా చూసుకోవాలని అన్నారు.భారత హజ్ కమిటీద్వారా వెళ్లే యాత్రికులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి.హజ్ యాత్రికులకు ముందస్తు అవగాహన కల్పించాలని రాష్ట్ర హజ్ కమిటీలకు ఆదేశాలు వచ్చాయని అన్నారు.చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని సూచన చేస్తున్నామన్నారు.

## ముప్పై ఏళ్ల ముచ్చట: ఘనంగా జల్లేపల్లి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తిరుమలాయపాలెం, జూన్ 7 (జనంసాక్షి)

కాలం మారింది.. బాధ్యతలు పెరిగాయి.. తలలు పండినా బాల్యపు జ్ఞాపకాలు మాత్రం చెక్కుచెదరలేదు. సరిగ్గా 32 ఏళ్ల క్రితం ఒకే బల్లపై కూర్చుని చదువుకున్న ఆ స్నేహితులంతా ఒకేచోట చేరి అప్పటి తీపి గుర్తులలో మునిగితేలారు. జల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ (పదో తరగతి) చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికంగా అత్యంత వైభవంగా జరిగింది. ముప్పై రెండు వసంతాల సుదీర్ఘ విరామం తర్వాత క్లాస్‌మేట్స్ అందరూ ఒకరినొకరు పేరుపేరునా పలకరించుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందబాష్పాలు రాల్చారు.

**గురువులకు పాదాభివందనం**

ఘన సత్కారం:తాము ఈరోజు సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబడటానికి కారణమైన నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఉపాధ్యాయులను వేదికపైకి పిలిచి పాదాభివందనం చేసి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ఆత్మీయతకు గురువులు సైతం భావోద్వేగానికి లోనయ్యారు. తమ చేతుల్లో పెరిగిన మొక్కలు నేడు సమాజానికి నీడను ఇచ్చే వృక్షాలుగా మారాయని ఉపాధ్యాయులు ఆశీర్వదించారు.

**విజయవంతం చేసిన మిత్రులు**

ఈ ఆత్మీయ కలయికను విజయవంతం చేయడంలో పూర్వ విద్యార్థులు మట్టా రాము, రామాసహాయం వెంకటరెడ్డి, ఎం.డి. జరీనా బేగం, సి.హెచ్. మాధవి, ఉప్పల సరిత, బుర్రి రవికుమార్, డి. నెహ్రూ, పసలాది దర్గయ్య, ఒంకోజు బ్రహ్మాచారి, కారింగుల అనీల్ కుమార్ తదితరులు ముఖ్య భూమిక పోషించారు. నాటి స్నేహితులందరూ కలిసి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, గ్రూప్ ఫోటోలు దిగడంతో ఈ సమ్మేళనం ముగిసింది.. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు మనోహరరాజు, ధర్మరాజు పూర్వ విద్యార్థుల లో మట్టా రాము, రామాసహాయం వెంకటరెడ్డి, ఎం.డి. జరీనా బేగం, సి.హెచ్చా. మాధవి , ఉప్పల సరిత, బుర్రి రవికుమార్, డి. నెహ్రూ, పసలాది దర్గయ్య, ఒంకోజు బ్రహ్మాచారి, కారింగుల అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టుపై అక్రమ కేసు :మాజీ ఎమ్మెల్యే అండ

### ఆధారాలు లేని కేసులు చెల్లవు, న్యాయపోరాటానికి సిద్ధం

తిరుమలాయపాలెం, జూన్ 8 (జనంసాక్షి )



విలేకరి రామకృష్ణపై పెట్టిన కేసు రాజకీయ కక్షతో కూడుకున్నదేనని మాజీ ఎమ్మెల్యే కందాళ విమర్శించారు. ఆదివారం బచ్చోడులో బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, అక్రమ కేసులను చట్టబద్ధంగా ఎదుర్కొంటామని ప్రకటించారు. మహిళా వైద్యురాలిని బెదిరించి డబ్బు డిమాండ్ చేశాడని, అనధికార వీడియోలు తీశాడన్న అభియోగాలపై రామకృష్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని ఖండించిన కందాళ "ఆరోపణలు చేస్తే సరిపోదు, ఆధారాలు చూపించాలి. బెదిరించాడనడానికి ఒక్క వీడియో, ఒక్క ఆడియో క్లిప్ అయినా ఉందా? ప్రాథమిక దర్యాప్తు లేకుండా నేరుగా కేసు పెట్టడమే కక్షసాధింపుకు నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. సుబ్లేడు పీహెచ్‌సీలో అవినీతిని, అవకతవకలను వార్తల ద్వారా బయటపెట్టినందుకే రామకృష్ణను టార్గెట్ చేశారని కందాళ ఆరోపించారు. "జర్నలిస్టుగా ప్రజా సమస్యలు రాసినందుకు అధికారులతో కలిసి తప్పుడు కేసు పెట్టారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించే చర్య" అని పేర్కొన్నారు. న్యాయస్థానంలో నిజానిజాలు తేలుస్తామని, బాధ్యులపై పరువు నష్టం దావా వేస్తామని తెలిపారు. రామకృష్ణకు పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. "నేను నిజాలు రాశాను. ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమాలను వెలుగులోకి తెచ్చాను. అందుకే నాపై బ్లాక్‌మెయిల్ ఆరోపణలు చేశారు. న్యాయం గెలిచే వరకు పోరాడతాను" అని రామకృష్ణ వెల్లడించారు. "రామకృష్ణ మంచివాడు. పేదల గొంతుకగా నిలుస్తుంటాడు. అతనిపై కావాలనే కేసు పెట్టారు" అని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

## ఘనంగా జెడ్పీహెచ్ఎస్ గుర్రంపోడు 2003-04 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**గుర్రంపోడు:జూన్ 07(జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-04 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ సన్నిధిలోని రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి ఉపాధ్యాయులైన మంచికంటి కృష్ణయ్య,చింతరెడ్డి కృష్ణారెడ్డి,వెంకటేశ్వర గుప్తా, చామకూరి లింగారెడ్డి, ఖలీం,కవిత, వద్దిరెడ్డి నరసింహారెడ్డి,రావుల వెంకట నారాయణ గౌడ్ లను శాలువా మరియు మేమేంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారి పాఠశాల దశలోని మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ ప్రస్తుత వారి యొక్క యోగక్షేమాలను పరస్పరం ఒకరినొకరు అడిగి తెలుసుకుని ఆనందోత్సాహాలతో ఆటపాటలతో ఉల్లాసభరితమైన వాతావరణంలో గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చాడ చక్రవర్తి,కుప్ప మహేష్, పోలేపల్లి నాగులు, ముష్టిపల్లి లింగస్వామి, పర్సనబోయిన వెంకన్న, వెంకన్న, మాదనబోయిన నరసింహ, బొడ్డుపల్లి నరేష్ చారి,మిట్టపల్లి శ్రీనివాస్, పోలేపల్లి ఏడుకొండలు, పగిళ్ళ అంజిబాబు, తూటుపల్లి బిక్షం,నాయక్,షేక్ ఫర్జానా, జ్యోతి, అంజమ్మ, రేపాక శోభారాణి, శ్వేత, బిక్షపమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**రామన్నపేట, జూన్ 7 (జనంసాక్షి):**
శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ కంతమహేశ్వర స్వామి కరుణా కటాక్షాలతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకాంక్షించారు. ఆదివారం మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ కంతమహేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మదర్ డైరీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి, సర్పంచ్ కంచి మధుసూదన్ మరియు గ్రామ ప్రజలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో విద్యను కార్పొరేట్ వ్యాపారంగా మార్చిన ప్రభుత్వ వైఖరిపై బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ ఆగ్రహం

**నాంపల్లి,జూన్ 7 (జనంసాక్షి)**
తెలంగాణలో విద్యను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే హక్కుగా కాకుండా, కార్పొరేట్ సంస్థలకు లాభాల వనరుగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై భారతీయ జనతా యువ మోర్చా మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక భారానికి గురిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి పిల్లల చదువుల కోసం ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులు, యూనిఫారాలు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అనేక విద్యాసంస్థలు 10% నుంచి 50% వరకు ఫీజులు పెంచడం అన్యాయమని పేర్కొంటూ, ఫీజుల పెంపును గరిష్టంగా 8%కే పరిమితం చేయాలని కోరారు. అలాగే రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం ప్రకారం 25% ఉచిత సీట్ల నిబంధనలను ఈ విద్యా సంవత్సరం నుంచే కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జిల్లా,మండల విద్య అధికారుల కొరత కారణంగా విద్యా వ్యవస్థపై పర్యవేక్షణ లేకుండా పోయిందని, విద్యాశాఖ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గుచేటని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు నియంత్రణ బిల్లును ఆర్డినెన్స్ రూపంలోనైనా వెంటనే అమలు చేసి, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా ఫీజులు పెంచిన విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చివరిగా ఆయన మాట్లాడుతూ, "చదువు హక్కు.వ్యాపారం కాదు.



తెలంగాణలో ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండే నాణ్యమైన విద్యను ప్రభుత్వం హామీ ఇవ్వాలి" అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై వారికీ కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి అలాగే పెండింగ్ లో ఉన్న ఫీజు రిఎంబెర్స్మెంట్ ను వెంటనే విడుదల చెయాలి లేకపోతే బి జె వై ఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం అని హెచ్చరించారు.



## ఇంద్రియాలలో ఘనంగా ఇంటింటా బడిబాట

**భూదాన్ పోచంపల్లి, జూన్ 7(జనం సాక్షి ):**
మండలంలోని ?ఇంద్రియాల గ్రామంలో సర్పంచ్ దిరావత్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతి నిధులు, ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి, బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ?ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి కృష్ణ, జడ్పీహెచ్ఎస్, పీఎస్ ప్రధానోపాధ్యాయులు గురునాథం, జగదీశ్వర, మాజీ ఎంపీటీసీ ఏదునోజు రాజానారాయణ, వార్డు సభ్యులు ఎర్ర విక్రమ్, కుమ్మరి బుచ్చిబాబు, మొగిలిపాక అనిత సుధాకర్, మొగిలిపాక గోపాల్, ఉపాధ్యాయులు వందన, రవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు



**నేరేడుచర్ల (జనంసాక్షి )**
సంపదను సృష్టిస్తూ దేశానికి అన్నం పెడుతున్న వ్యవసాయ కార్మికులకు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మేడారం గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నేరేడుచర్ల మండల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రెక్కల కష్టం చేసి సంపదను సృష్టిస్తున్న వ్యవసాయ కార్మికుల జీవనం దుర్భరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిన వ్యవసాయకార్మికులకుతినటానికి తిండి, ఉండటానికి ఇల్లు, కట్టుకోవటానికి బట్ట కరువైందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర కేంద్ర శాసన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12000 ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి 23 నెలలు అవుతున్న ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయలేదని ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే ఇండ్లు మంజూరు చేయటం సిగ్గుచేటు అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్నారు. వ్యవసాయ కార్మికులు సంపాదించే సంపాదనలో 90 శాతం విద్య, వైద్యానికి ఖర్చు చేస్తున్నారని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సౌకర్యాలుమెరుగుపరచాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు నెలకు 7500 పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఈ మహాసభలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీను, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు మామిడి నాగ సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుంజా వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం మండల నాయకులు కట్ట మధుబాబు, టిపిటిఎల్ఎఫ్ జిల్లా నాయకులు మామిడి జానకి రాములు, యుటిఎఫ్ జిల్లా నాయకులు పగిళ్ల హుస్సేన్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నాయకురాలు శనగాని లక్ష్మి, సుంకర బోయిన సైదమ్మ, నాయిని నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాపాడేది ఎంప్లాయిస్ యూనియన్

**కోదాడ,( జనంసాక్షి):**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో జరుగుతున్న ప్రస్తుత పరిస్థితులలో కార్మికుల శ్రేయస్సుకోసం ఐక్య ఉద్యమాల సారథి ఎంప్లాయిస్ యూనియన్ చేస్తున్న కృషిని మరియు ఎంప్లాయిస్ యూనియన్ చేస్తున్న పోరాటాలని చూసి ఆర్టీసీ కార్మికుల హక్కులను కాపాడే ఏకైక నాయకత్వం ఎంప్లాయిస్ యూనియన్ అని నమ్మి కోదాడ డిపోలో దాదాపుగా 50 మంది కార్మికులు జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జమాల్ గౌడ్ , ఎంప్లాయిస్ యూనియన్ కోదాడ డిపో గౌరవాధ్యక్షులు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ చేరడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటంతో పాటు 8 గంటల పని విధానం వారాంతపు సెలవులు సాధించిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ కి దక్కిందని నాటి పాలకులకు వ్యతిరేకంగా 55 రోజుల సమ్మె నిర్వహించి హక్కులను సాధించి నేటి ప్రభుత్వం పైన పోరాటం నడిపి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి యూనియన్ ఎన్నికలకు సిద్ధం చేస్తున్న ఏకైక సంఘం ఎంప్లాయిస్ యూనియన్ అని ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చేసే బాధ్యత ఎంప్లాయిస్ యూనియన్ తీసుకుందని వారు అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్ కోదాడ డిపో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది. ఎంప్లాయిస్ యూనియన్ డిపో గౌరవాధ్యక్షులుగా మేకల శ్రీనివాసరావు కమిటీ చైర్మన్గా ఎస్ఎస్ రావు, డిపో అధ్యక్షులుగా వై శ్రీనివాస్ రావు,డిపో కార్యదర్శిగా ఎస్ వెంకన్న, డిపో ట్రెజరర్ గా కే వెంకన్న, మహిళ నాయకురాలుగా ఏ. భవాని, గురు లక్ష్మి మరియు సత్యవతి డిపో గ్యారేజీ సెక్రటరీగా రవి, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కేఎస్ రెడ్డి, పాండయ్య, బాసాని వెంకటయ్య, నందనం జిల్లా కార్యదర్శి రాజుగారు రాజశేఖర్ స్వామి గోపాల్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.